# సాక్షి కర్నూలు

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024




**అలరించిన నృత్య ప్రదర్శన**

శ్రీశైలంటెంపుల్: ఆలయ నిత్యకళావేదికపై శనివారం చెన్నైకి చెందిన మైత్రీ సెంటర్ ఫర్ ఆర్ట్స్ వారి సంప్రదాయ నృత్యం భక్తులను అలరించింది. పలు భక్తి గీతాలకు నృత్యం ప్రదర్శించారు.



**చెరువా.. ఎందుకు నిండ లేదు!**

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా 70 చెరువులను నింపడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కరువు ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో▸



**టీబీ డ్యాం సమాచారం**

| | |
|---|---|
| పూర్తి మట్టం (అడుగులు) | :1,633 |
| ప్రస్తుతం | :1,632 |
| సామర్థ్యం (టీఎంసీలు) | :105.788 |
| ప్రస్తుతం | :101.773 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | :10,742 |
| అవుట్ ఫ్లో | :10,142 |

## న్యూస్‌రీల్

### తరగతులు ఐదు.. విద్యార్థులు ఆరుగురు



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

మద్దికెర: బొమ్మనపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతుల్లో కేవలం ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. 2వ తరగతిలో ఇద్దరు, 4లో ఒకరు, 5లో ముగ్గురు మాత్రమే విద్యనభ్యసిస్తున్నారు. వారికి విద్య బోధించేందుకు ఒక ఉపాధ్యాయున్ని నియమించారు. ఈ గ్రామంలో ఎక్కువ కుటుంబాలు ఉపాధి కోసం హైదరాబాద్, గుంటూరు, బెంగళూరు తదితర పట్టణాలకు వలస వెళ్లిపోయాయి. దీంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పడిపోయింది. గతంలో ఇలాగే విద్యార్థి సంఖ్య పడిపోవడంతో స్కూలు మూత పడింది. అయితే కరోనా సమయంలో వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన కుటుంబాలు స్వగ్రామానికి చేరుకోవడంతో విద్యార్థుల సంఖ్య మళ్లీ 25 చేరింది. అయితే ఇటీవల కొందరు మళ్లీ ఉపాధి కోసం వలస వెళ్లడంతో విద్యార్థుల సంఖ్య ఆరుగురికి పడిపోయిందని ఉపాధ్యాయుడు నాగేషు శనివారం తెలిపారు.

### మార్కెట్‌కు పోటెత్తుతున్న ఉల్లి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి ధర స్వల్పంగా పెరిగింది. మార్కెట్‌కు రికార్డు స్థాయిలో 8,497 క్వింటాళ్ల ఉల్లి మార్కెట్‌కు వచ్చింది. కనిష్టంగా క్వింటాకు రూ.297, గరిష్టంగా రూ.4,019 ధర లభించింది. సగటు ధర రూ.3,869 నమోదు కావడం విశేషం. తాడేపల్లిగూడెంతో పోలిస్తే కర్నూలు మార్కెట్‌లో ఉల్లి ధర నిరాశకు గురి చేస్తోంది.

- ➢ వేరుశనగ ధర అంతంతమాత్రంగానే ఉంటోంది. మార్కెట్‌కు 684 క్వింటాళ్ల వేరుశనగ వచ్చింది. కనిష్ట ధర రూ.3,609, గరిష్ట ధర రూ.7,496 లభించింది. సగటు ధర రూ.5,300 నమోదైంది.
- ➢ కొర్రల ధర నిరాశజనకంగా ఉంది. మార్కెట్‌కు కొర్రలు 695 క్వింటాళ్లు రాగా.. కనిష్ట ధర రూ.2,192, గరిష్ట ధర రూ.2,979.. సగటు ధర రూ.2,396 లభించింది.
- ➢ సజ్జల ధర కాస్త పెరిగింది. మార్కెట్‌కు 474 క్వింటాళ్ల సజ్జలు రాగా క్వింటాకు కనిష్టంగా రూ.1,975, గరిష్టంగా రూ.2,301.. సగటు ధర రూ.2,049 నమోదైంది.

### పంటల నమోదుకు రెండు రోజులే అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ పంటల నమోదు ప్రక్రియ 99.66 శాతం పూర్తయింది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఈ నెల 15లోపు ఈ–పంట యాప్‌లో పంటలను నమోదు చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఈ నెల 23 వరకు పొడిగించింది. ఖరీఫ్ సాధారణ సాగు 10,35,895 ఎకరాలు ఉండగా 10,40,908 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో 10,37.357 ఎకరాల్లో సాగు చేసిన పంటలను నమోదు చేశారు. నమోదు చేసిన పంటలకు సంబంధించి 10,35,306(99.80 శాతం)లో సాగు చేసిన పంటలకు వీఏఏ ఈ–కేవైసీ పూర్తి చేశారు.

### పలు మండలాల్లో వర్షం

- కోతకు వచ్చిన పంటలపై వరుణుడి ప్రతాపం



నీట మునిగిన పొగాకు పంట

కర్నూలు(అగ్రికల్చర్)/ఓర్వకల్లు: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. ఈ వర్షాల వల్ల పంటలకు భారీగా నష్టం చేకూరే ప్రమాదం ఏర్పడింది. కొర్ర, సజ్జ పంటల కోతలు, నూర్పిడి చురుగ్గా సాగుతున్నాయి. ఈ వర్షాల వల్ల కంకులు తడిచి గింజల నాణ్యత దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. పత్తిలో కాయలు పగులుతున్నాయి. వర్షాలకు పత్తి తడవటం వల్ల నాణ్యత దెబ్బతింటోంది. శనివారం సాయంత్రం ఓర్వకల్లు, వెల్దుర్తి, ఎమ్మిగనూరు, ఆదోని, కౌతాళం, ఆలూరు, కర్నూలు మండలాల్లో వర్షాలు కురిశాయి.

**నీట మునిగిన పొగాకు పంట**

ఓర్వకల్లు మండలంలో బ్రాహ్మణపల్లె, తిప్పాయపల్లె, ఓర్వకల్లు గ్రామాల్లో శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి పంటలకు అపార నష్టం కలిగింది. పొగాకు పంటకు మంచి డిమాండ్ ఉండడంతో ఈ ఏడాది అధిక శాతం రైతులు ఈ పంటనే సాగు చేస్తున్నారు. అయితే శనివారం కురిసిన అకాల వర్షానికి వందలాది ఎకరాలలో సాగు చేసిన పొగాకు పంట నీట మునిగింది. లోతట్టు ప్రాంతాల్లోని పొలాలు నీటి కుంటలుగా మారి రైతులు తీవ్రంగా నష్టపోయారు.

### మందులు బయటకు రాస్తే ఎలా కొనేది ?



నేను చాకలి వృత్తి చేస్తూ వయస్సు మీద పడటంతో ఇప్పుడు ఇంటి వద్ద ఉంటున్నాను. కడుపునొప్పి, విరేచనాలు కాకపోవడంతో ఓపీ నెం.14కు వెళ్లాను. అక్కడ పరీక్ష చేసిన డాక్టర్లు మందులు రాసిచ్చారు. మందుల కౌంటర్‌లో అడిగితే బయట కొనుగోలు చేయాలన్నారు. మందుల షాపులో అడిగితే వంద రూపాయలు పైగానే చెప్పారు. మాలాంటి వారికి మందులు కొనాలంటే భారమవుతోంది.

– శేషన్న, బ్రాహ్మణకొట్కూరు

### రూ. 8 వేలు ఖర్చు అయ్యింది



నా కూతురు సునీత(20) ఆరోగ్యం బాగాలేక ఊపిరితిత్తుల్లో నిమ్ము చేరి ఉంటే 20 రోజుల క్రితం ఆసుపత్రిలో చేర్పించాను. ప్రస్తుతం ఆమె ఏఎంసీ విభాగంలో చికిత్స పొందుతోంది. అక్కడి డాక్టర్లు ప్రతిరోజూ మందులు బయటకు రాసిస్తూనే ఉన్నారు. ఇప్పటికీ రూ.8వేల దాకా ఖర్చు అయ్యింది. అన్ని మందులు బయటకే రాసిస్తే ఇక ప్రభుత్వ ఆసుపత్రి ఎందుకు...?.

– రామకృష్ణ, కంబాలపాడు గ్రామం, క్రిష్ణగిరి మండలం



ఆసుపత్రి మందుల కౌంటర్ వద్ద పలుచబడిన రోగులు

# పెద్దాసుపత్రిలో మందుల్లేవ్



జీవనధార మందుల దుకాణం వద్ద రోగుల రద్దీ

- సగం మందులు బయట కొనుగోలు
- రోగుల జేబులు ఖాళీ
- క్యాజువాలిటీని వేధిస్తున్న ఇదే సమస్య
- పట్టించుకోని ఆసుపత్రి అధికారులు

కర్నూలు(హాస్పిటల్): రాయలసీమ ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మందుల కొరత తీవ్రంగా ఉంది. రోగులకు అవసరమైన సగం మందులను బయటే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయా వ్యాధులకు బేసిక్ మందులు సైతం అందుబాటులో లేని పరిస్థితి ఉంది. అరకొరగా ఉన్న మందులతో సగం మందికి ఇచ్చి మరో సగం మందికి బయటకు రాసిస్తున్నారు. ఫలితంగా అత్యవసర వైద్యం అందాల్సిన పరిస్థితుల్లోనూ మందుల కోసం చీటీలు తీసుకుని బయటకు పరుగులు తీయాల్సి వస్తోంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు కర్నూలుతో పాటు నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్, రాయచోటి, ప్రకాశం జిల్లాల నుంచి రోగులు చికిత్స కోసం వస్తుంటారు. వీరితో పాటు జిల్లా సరిహద్దుల్లో ఉన్న కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల్లోని పలు జిల్లాల రోగులు సైతం ఇక్కడికే చికిత్స కోసం వస్తున్నారు. ప్రతిరోజూ 2,500 నుంచి 3 వేల మంది వరకు రోగులు చికిత్స కోసం వస్తున్నారు. ఇన్ పేషెంట్లుగా నిత్యం 1,200 నుంచి 1,500 దాకా ఉంటున్నారు. వీరందరికీ అవసరమైన వైద్యపరీక్షలు, మందులు ఏర్పాటు చేయాల్సిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. గత ప్రభుత్వం కొనుగోలు చేసిన మందులను మాత్రమే ఇప్పటికీ ఇస్తూ కాలం వెళ్లదీస్తోంది. నాలుగు నెలల క్రితం వచ్చిన మందుల్లో సగానికి పైగా ఖాళీ కాగా మిగిలిన మందులతో నెట్టుకొస్తున్నారు.

**కొరత ఉన్న మందుల్లో కొన్ని...**

ఆసుపత్రికి గుండెకాయగా ఉన్న క్యాజువాలిటీలోనే మందుల కొరత వేధిస్తోంది. ఇక్కడ గత కొన్ని రోజులుగా మందులను బయటకు రాసిస్తున్నారు.

- ➤ ప్రధానంగా కడుపునొప్పి వస్తే బయటకు వెళ్లి మందులు తీసుకొచ్చేందుకు కుటుంబసభ్యులకు కాళ్ల నొప్పులు రావడం ఖాయం.
- ➤ కడుపునొప్పికి వాడే ప్యాంటాప్రాజోల్, సైక్లోపామ్, వామికైండ్‌తో పాటు క్లిండామైసిన్, ఆర్బినేట్, లాసెక్స్, ట్రమడాల్, ఇన్‌ఫ్యూజన్, కేసీఎల్, సోడా బైకార్బనేట్, సెఫిక్సిమ్ తదితర మందులు లేవు. వీటిలో కొన్ని మాత్రమే ఇవ్వడంతో సరిపోక బయటకు రాస్తున్నారు.
- ➤ ఏఎంసీలో ప్రతి మందునూ బయటకు రాస్తున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ➤ డిశ్చార్జ్ అయ్యేలోగా ఒక్కోరోగి రూ.5వేల నుంచి రూ.10వేలకు పైగా మందులకే ఖర్చు చేస్తున్నారు.
- ➤ ఆసుపత్రిలో అమాక్సిలిన్, అమాక్సిలిన్–క్లావఫేనిక్ యాసిడ్, సెఫిక్సిమ్ మాత్రలు స్టోర్‌లో ఖాళీ అయిపోయాయి.
- ➤ డయాబెటీస్ రోగులకు అవసరమైన హ్యూమన్ మిక్స్‌టర్డ్ ఇన్సులిన్‌ను పరిమితంగా ఇస్తున్నారు.
- ➤ గతంలో నెలకు అవసరమైన ఇన్సులిన్‌ను ఇచ్చేవారు. ఇప్పుడు ఒకటి, రెండు చేతిలో పెట్టి పంపించేస్తున్నారు.

**రక్తపరీక్షలకూ కిట్లు లేవు**

న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లోని బయోకెమిస్ట్రీ విభాగంలో కిట్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. రక్తపరీక్ష చేయించుకోవాలంటే అవసరమైన ట్యూబులు, మూత్రపరీక్షలకు అవసరమైన శాంపిల్ డబ్బాలు బయటకు రాస్తున్నారు. ఇక సీటీస్కాన్, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కాన్ సందర్భంగా కొన్ని అవసరమైన జెల్‌లు, ఇంజెక్షన్లు సైతం బయట నుంచే తెప్పిస్తున్నారు. దీంతో పాటు యూరిక్ యాసిడ్, థైరాయిడ్, ఎల్ఎఫ్‌టీ వంటి పరీక్షలు అరకొరగా చేస్తున్నారు. ఈ పరీక్షలు కేవలం అయినవారికి మాత్రమే చేస్తున్నారు. కాని వారికి బయటకు పంపిస్తున్నారు.

### ప్రజా ప్రయోజన పనులకు ప్రాధాన్యత

- జూమ్ కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ, డీపీఓ



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే పనులకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు అన్నారు. శనివారం వారు జిల్లాలోని ఎంపీడీఓ, ఈఓఆర్‌డీలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణతేజ ఆదేశాల మేరకు ఇప్పటికే విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేయాలన్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామ పంచాయతీల పరిధిలోని శిథిలావస్థకు చేరిన గ్రామ పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లకు మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. అలాగే ఎస్‌డబ్ల్యూపీసీలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయాలన్నారు. గ్రామ కంఠం స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పార్కులుగా తీర్చిదిద్ది గ్రామంలో మంచి వాతావరణాన్ని కల్పించాలన్నారు. నిధులు అధికంగా ఉన్న పంచాయతీల్లో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని, కూరగాయల వ్యాపారాలకు సంబంధించి ఒకే ప్రాంతంలో ప్లాట్‌ఫామ్స్ నిర్మించి షెడ్లు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోకరంగాను, గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరుగాను ఉపయోగపడుతుందన్నారు.

### రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు.

# రెవెన్యూలో భారీగా బదిలీలు

**వివిధ కేడర్లలో 400 మందికి స్థానచలనం**

- పత్తికొండ తహసీల్దార్‌గా డీటీ ఎస్.విజయకుమార్‌కు బాధ్యతలు
- కలెక్టరేట్ ఏఓగా ఐ.విజయశ్రీ.. ఓర్వకల్ తహసీల్దార్ మార్పు



కర్నూలు(సెంట్రల్): రెవెన్యూ శాఖలో 400 మందిని బదిలీ చేస్తూ శనివారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా సోమవారం రిలీవ్ కావాల్సి ఉంది. అయితే సచివాలయ వీఆర్వోలు మాత్రం 26వ తేదీ వరకు రిలీవ్ కాకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ తరువాత వారు బదిలీ అయిన ప్రదేశానికి వెళ్లి రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. అయితే బదిలీల్లో రాజకీయ సిఫారసులకే పెద్దపీట వేసినట్లు తెలుస్తోంది. బదిలీ అయిన వారిలో తహసీల్దార్లు 9 మంది, డీటీలు 42 మంది, రీసర్వే డీటీలు 10 మంది, జూనియర్ అసిస్టెంట్లు 12 మంది, జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్లు 2, సీనియర్ అసిస్టెంట్లు 21 మంది, ఆర్ఐలు 9 మంది, ఆఫీసు సబార్డినేట్ ఒక్కరు, వీఆర్వోలు 294 మంది ఉన్నారు. గ్రేడు–1 వీఆర్వోలు 101, గ్రేడు–2 వీఆర్వోలు 193 మందికి స్థానచలనం కలిగింది. ఇక కర్నూలు జిల్లా నుంచి నంద్యాల, నంద్యాల జిల్లా నుంచి కర్నూలుకు మ్యూచువల్ బదిలీల కింద 15 మందిని వివిధ కేడర్లలో పనిచేస్తున్న వారిని బదిలీ చేశారు.

**కలెక్టరేట్ ఏఓగా ఐ.విజయశ్రీ**

ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లను తిరిగి జిల్లాకు కేటాయించిన సమయంలో జూలై 31వ తేదీన అందరికీ స్థానాలను కేటాయించారు. అయితే 22 రోజులు గడవకముందే సాధారణ బదిలీల్లో మరోసారి పలువురు తహసీల్దార్లను మార్చారు. అప్పట్లో కలెక్టరేట్ ఏఓగా పి.రాజేశ్వరిని నియమించగా.. ప్రస్తుతం ఆమె స్థానంలో సి.బెళగల్ తహసీల్దార్ ఐ.విజయశ్రీని నియమించారు. పి.రాజేశ్వరిని కలెక్టరేట్‌లోని సి.సెక్షన్ సూపరింటెండెంట్‌గా మార్పు చేశారు. ప్రస్తుతం పత్తికొండ తహసీల్దార్‌గా ఉన్న ఈ.వెంకటలక్ష్మీని కర్నూలు అర్బన్ తహసీల్దార్‌గా నియమించారు. పత్తికొండకు రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించకుండా అక్కడ డీటీగా ఉన్న ఎస్.విజయకుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

**తహసీల్దార్ల బదిలీలు ఇలా..**

| తహశీల్దార్ పేరు | ప్రస్తుతం స్థానం | బదిలీ ప్రదేశం |
|---|---|---|
| ఎస్.రామాంజనమ్మ | కర్నూలు అర్బన్ | దేవనకొండ |
| ఈ.వెంకటలక్ష్మీ | పత్తికొండ | కర్నూలు అర్బన్ |
| కె.సతీష్ | డీఏఓ, ఆర్‌డీఓ ఆఫీసు, పత్తికొండ | హొళగుంద |
| ఎం.ప్రసాదరాజు | హొళగుంద | డీఏఓ, ఆర్‌డీఓ ఆఫీసు, పత్తికొండ |
| టి.శ్రీనివాసరెడ్డి | సీసీఎల్ఏ | సీ.బెళగల్ |
| జీవీఎస్ విద్యా సాగర్ | నంద్యాల జిల్లా | ఓర్వకల్ |
| పి.రాజేశ్వరి | ఏఓ, కలెక్టరేట్ | సూపరింటెండెంట్ సీ సెక్షన్ |
| ఐ.విజయశ్రీ | సి.బెళగల్ | ఏఓ కలెక్టరేట్ |
| ఎస్.యుగేశ్వరి దేవి | కలెక్టరేట్ సీ సెక్షన్ | తుగ్గలి |

# పోలీసుల మూకుమ్మడి తనిఖీలు

- రికార్డులు లేని 25 బైకులు స్వాధీనం



పత్తికొండలో పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కర్నూలు: జిల్లాలో హత్యలు, హత్యాయత్నాలు, వరుస గొలుసు దొంగతనాల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. నేరాల నియంత్రణకు కట్టడి, ముట్టడి పేరుతో (కార్డెన్ సెర్చ్) సమస్యాత్మక ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. హోంగార్డు నుంచి డీఎస్పీ స్థాయి అధికారి వరకు మూకుమ్మడిగా తనిఖీల్లో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా శనివారం కల్లూరులోని శరీన్ నగర్‌లో కర్నూలు సబ్ డివిజన్ పోలీసులు, పత్తికొండ పట్టణంలో సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.

**తెల్లవారుజామునే కాలనీల ముట్టడి**

- ➡ తెల్లవారుజామున 4.30 గంటలకు పోలీసులు పెద్ద సంఖ్యలో కల్లూరులోని శరీన్‌నగర్‌కు చేరుకున్నారు. రోజూవారీ పెట్రోలింగ్ తరహాలో సైరన్ వేసుకుని ఇలా వచ్చి.. అలా వెళ్లిపోతారులే అని కాలనీవాసులు భావించారు. కానీ పోలీసులు మొత్తం కాలనీని చుట్టుముట్టి అనుమానితులు, పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. 10 అనుమతి లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.
- ➡ పత్తికొండ పట్టణంలో కూడా సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులంతా కలసి డీఎస్పీ వెంకటరామయ్య ఆధ్వర్యంలో ఆదే తరహాలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని మద్యం, సారా, మట్కారాయుళ్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

**చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం**



కార్డెన్ సెర్చ్ అంటే నేరాల అదుపునకు చేసే తనిఖీలు. సోదాలతో పాటు ప్రజలకు శాంతిభద్రతల పరంగా ఉండే ఇబ్బందులు తెలుసుకునేందుకు సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. కార్డెన్ సెర్చ్ తనిఖీల ద్వారా నేరస్తులను గుర్తించడం, అక్రమ దందాలకు పాల్పడే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం.

– బాబుప్రసాద్, డీఎస్పీ, కర్నూలు

### శ్రీశైలం డ్యాం నీటి మట్టం 877.10 అడుగులు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో శనివారం సాయంత్రం సమయానికి 173.4698 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. డ్యాం నీటిమట్టం 877.10 అడుగులకు చేరుకుంది. జూరాలలో విద్యుత్ ఉత్పాదన ద్వారా 10,152 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శుక్రవారం నుంచి శనివారం వరకు ఎగువ ప్రాజెక్టుల నుంచి 14,721 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. శ్రీశైలం నుంచి దిగువ ప్రాంతాలకు 77,833 క్యూసెక్కుల నీరు విడుదలైంది. కుడిగట్టు కేంద్రంలో 2.528 మిలియన్ యూనిట్లు, ఎడమ గట్టు కేంద్రంలో 16.263 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

# జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోండి




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

- దిశా కమిటీ సమావేశంలో మంత్రి టీజీ భరత్

కర్నూలు(సెంట్రల్): జిల్లా సమగ్రాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అధ్యక్షతన దిశా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా మంత్రి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పరిశ్రమల శాఖలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మాదిరిగానే జిల్లాలో అన్ని శాఖల్లో అభివృద్ధి పనులు వేగం పుంజుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించడంలో తమిళనాడు రాష్ట్రం టాప్‌లో ఉందని, ఆ స్థానానికి చేరుకోవడానికి అవసరమైన ప్రణాళికలతో ముందుకెళ్లాలన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల భవనాల పరిస్థితి గురించి స్టైంథింగ్ రిపోర్టు పంపమని రెండు నెలల కింద అడిగామని, ఇప్పటి వరకు తమకు నివేదిక అందలేదన్నారు. కర్నూలు ఎంపీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులను పూర్తి స్థాయిలో వినియోగించాలని సూచించారు. వ్యవసాయానికి సంబంధించి పీఎంకేఎస్‌వై నిధులు రావడంలేదని అధికారులు ఆయన దృష్టికి తీసుకురాగా విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలను మెరుగు పరచేందుకు రూ.10 కోట్ల సీఎస్ఆర్ నిధులను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని, తగిన నివేదికలతో రావాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ..క్రాప్ డ్యామేజ్ ఇన్సూరెన్స్ పెండింగ్ ఏమైనా ఉన్నాయా? బడ్జెట్ ఎప్పటి నుంచి పెండింగ్‌లో ఉంది?ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్న వివరాలను నివేదించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఆలూరులో ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయుటకు 5 ఎకరాల పొలం ఇచ్చేందుకు ఒకరు ముందుకొచ్చారని, దానిపై పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాలల భవనాల స్థితిగతులపై పరిశీలన చేయాలని పీఆర్ అండ్ ఆర్ అండ్‌బీ శాఖల అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా ఎక్కడెక్కడ హాస్టళ్లు, గురుకులాలు, కేజీబీవీలు అవసరమో నివేదించాలని ఎంఈఓలను ఆదేశించారు. టిడ్కో గృహాలను పేదలకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కర్నూలు–బళ్లారి రహదారిని నేషనల్ హైవే చేయడం కోసం ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. కోడుమూరు–ఎమ్మిగనూరు రోడ్డు పనులకు సంబంధించి టెండర్ పనులను త్వరగా ఫైనల్ చేయాలన్నారు. కోడుమూరు – సీ బెళగల్ రోడ్డుకు కూడా మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరి , అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

# శ్రీశైలం ఈఓ బదిలీకి రంగం సిద్ధం!

- పావులు కదిపిన కూటమి నేతలు
- గత ఈఓకు ఎమ్మెల్యే ఆశీస్సులు ఉన్నట్లు సమాచారం



దేవస్థాన పరిపాలన భవనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న డి.పెద్దిరాజును అధికార పార్టీ నేతలు బదిలీపై పంపేందుకు పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. వైఎస్సార్ జిల్లా ట్రాన్స్‌పోర్టు, రోడ్లు, భవనాలశాఖ, భూసేకరణ విభాగానికి డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ డిప్యూటేషన్‌పై గతేడాది సెప్టెంబరు 25న శ్రీశైలం ఈఓగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఏడాది కాలపరిమితితో రెవెన్యూ నుంచి డిప్యూటేషన్‌పై దేవదాయశాఖకు బదిలీపై వచ్చారు. డి.పెద్దిరాజు ఈఓగా బాధ్యతలు చేపట్టి ఈ నెల 24వ తేదీకి సంవత్సరం కావడంతో ఆయన డిప్యూటేషన్ కూడా పూర్తవుతుంది. డిప్యూటేషన్ పూర్తయిన వెంటనే బదిలీ చేసేందుకు అధికారపార్టీ నేతలు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుత ఈఓ పెద్దిరాజు సౌమ్యుడిగా గుర్తింపు పొందారు. పని ఎక్కువ, మాటలు తక్కువ అనే ముద్ర వేసుకున్నారు. భక్తుల అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారనే అధికారులు సైతం చెబుతున్నారు. అయితే ఇటీవల కూటమి నేతలకు ఈఓ అనుకునేంత స్థాయిలో సహకరించలేదనే గుసగుసలు వినపడుతున్నాయి. దీంతో వారు ఈఓ వ్యవహారశైలిపై అసంతృప్తి వ్యక్తం చేసి ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ క్రమంలోనే ఈఓ బదిలీకి అడుగులు పడినట్లు తెలుస్తుంది.

**గతంలో పనిచేసిన అధికారి ప్రయత్నం**

శ్రీశైల దేవస్థానానికి గతంలో ఈఓగా విధులు నిర్వహించిన ఓ అధికారి తిరిగి ఈఓగా వచ్చేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని కూడా స్వయంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నేతలు ముందుగా ఈఓ గా ఐఏఎస్ అధికారిని తీసుకువస్తే అభివృద్ధి వేగంగా చెందుతుందని భావించారు. ముగ్గురు ఐఏఎస్ అధికారులను సైతం సంప్రదించినట్లు సమాచారం. అయితే అది కార్యరూపం దాల్చే పరిస్థితి లేక పోవడంతో ఇంతలో గతంలో పనిచేసిన అధికారి ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఆయనకు క్షేత్రంపై అవగాహన ఉండటంతో ఎమ్మెల్యే కూడా ఆయన వైపు మొగ్గు చూపినట్లు సమాచారం. శ్రీశైలంలో కొందరికి స్వయంగా ఆయనే ఫోన్ చేసి ఈఓగా వస్తున్నానని చెప్పినట్లు ప్రచారం సాగుతుంది. ప్రస్తుతం ఉన్న ఈఓ పెద్దిరాజును బదిలీ చేయించి కూటమి నాయకులు పంతం నెగ్గించుకుంటారో లేక పెద్దిరాజు తన సర్వీసును మరో ఏడాది పొడిగించుకుంటారో రెండు రోజుల్లో తేలిపోనుంది.

## క్లుప్తంగా

### జిల్లాకు నలుగురు తహసీల్దార్లు కేటాయింపు

కర్నూలు (సెంట్రల్): జోన్-4 పరిధిలోని వివిధ జిల్లాల నుంచి జిల్లాకు నలుగురు తహసీల్దార్లను కేటాయిస్తూ సీసీఎల్ఏ ఉత్తర్వులు ఇచ్చింది. శ్రీసత్యసాయి జిల్లా నుంచి కె.రమాదేవి, వైఎస్సార్ కడప నుంచి ఎం.ఎ.రమేష్, అన్నమయ్య జిల్లా నుంచి సీహెచ్ ఇంద్రాణి, చిత్తూరు నుంచి డి.లోకేశ్వరరావులను కేటాయించారు. వీరికి జిల్లాలో స్థానాలు కేటాయించాల్సి ఉంది.

### టెండర్ నోటీసు రద్దు

కర్నూలు(అర్బన్): 2024-25 సంవత్సరానికి జిల్లాలోని సాంఘిక/ గిరిజన సంక్షేమ వసతి గృహాలకు ఆహార పదార్థాల సరఫరాకు సంబంధించి ఈ నెల 15వ తేదీన ఇచ్చిన నోటీసును రద్దు చేస్తున్నట్లు ఆ శాఖ సంయుక్త సంచాలకులు జె.రంగలక్ష్మీదేవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనివార్య కారణాల వల్ల జిల్లా సంయుక్త కలెక్టర్/ జిల్లా కొనుగోలు కమిటీ అధ్యక్షులు ఈ నోటీసును రద్దు చేశారన్నారు.

### కౌలు రైతు ఆత్మహత్య


సురేష్‌నాయుడు (ఫైల్)

మద్దికెర: మండల పరిధిలోని కొత్తపలి గ్రామానికి చెందిన చాగంటి సురేష్ నాయుడు (35) అనే కౌలు రైతు శనివారం విషగుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన చాగంటి రమేష్‌నాయుడుకు ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. కూతురుకు పెళ్లి అయ్యింది. కుమారుడు సురేష్‌నాయుడు సమీప బంధువులకు సంబంధించిన 20 ఎకరాల పొలాన్ని కౌలుకు చేస్తున్నాడు. పంట కలిసి రాక దాదాపు రూ. 20 లక్షల వరకు అప్పులయ్యాయి. ఈ బాధతో ఇంటిలోనే శనగల్లో కలిపే విషగుళికలు మింగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. వెంటనే వైద్యపరీక్షల కోసం గుంతకల్లుకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు మృతుడి భార్య లక్ష్మి తెలిపారు.

### అనుమానాస్పద స్థితిలో యువతి ఆత్మహత్య

కర్నూలు: ధర్మపేటకు చెందిన హనుమంతు, నిర్మల దంపతుల కూతురు అనురాధ (24) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈమె డిగ్రీ వరకు చదువుకుంది. ఎస్ఆర్ పేటకు చెందిన మహబూబ్ బాషా అలియాస్ చోటును ప్రేమించి నెల రోజులుగా ఎస్ఆర్ పేటలో అతనితో సహజీవనం చేస్తోంది. అనురాధ అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లో బ్యుటీషియన్‌గా పనిచేసేది. శుక్రవారం రాత్రి భర్త మహబూబ్ బాషా ఇంటి బయట పడుకోగా భార్య పడక గదిలో పడుకుంది. రాత్రి 9:45 గంటల సమయంలో భర్త గదిలోకి వెళ్లగా అప్పటికే ఆమె ఇంటి పైకప్పున ఉన్న కొంకికి చున్నీతో ఉరి వేసుకుంది. వెంటనే ఉరి నుంచి తప్పించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే మృతురాలి భర్తపైనే తమకు అనుమానం ఉందని అనురాధ కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలిసిన వెంటనే రెండో పట్టణ ఎస్ఐ కిరణ్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### మద్యం పట్టి వేత

చాగలమర్రి: మండలంలో వేర్వేరు వ్యక్తుల వద్ద పోలీసులు 104 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. పెద్ద బోధనం గ్రామానికి చెందిన కసినేని నాగేశ్వరరావు అనే వ్యక్తి చాగలమర్రిలోని వివిధ మద్యం షాపుల్లో 54 బాటిళ్ల కొనుగోలు చేసి తన స్వగ్రామంలో అధిక ధరకు అమ్ముకునేందుకు తీసుకెళ్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు చాగలమర్రిలోని ముత్యాలపాడు బస్టాండ్ వద్ద తనిఖీ చేసి పట్టుకున్నారు. అలాగే శనివారం మధ్యాహ్నం ముత్యాలపాడు గ్రామానికి చెందిన ఖాదర్‌గాళ్ల ఇమాము అనే వ్యక్తి అక్రమంగా 50 బాటిళ్లు తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు.

# చెరువా.. చెరువా నువ్వేందుకు నిండ లేదు!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో చెరువులకు నీరందించేందుకు రూ.294 కోట్లతో పనులు
- గతేడాది సెప్టెంబర్ 19న జాతికి అంకితం చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్
- ప్రస్తుతం 70 చెరువులకు పైగా నీరిచ్చేందుకు అవకాశం ఉన్నా పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- వంద రోజులైనా పథకం నిర్వహణకు పైసా విదల్చని వైనం
- నేడు హంద్రీనీవా కాలువను పరిశీలించనున్న జల వనరుల శాఖ మంత్రి

**కరువుకు మారుపేరు పశ్చిమ ప్రాంతం. అలాంటి ఈ ప్రాంతంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. సాగు, తాగునీటికి ఆధారమైన చెరువులను కృష్ణా జలాలతో నింపేందుకు అవకాశం ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. అధికారంలోకి వచ్చి వందరోజులైనా చెరువుల పథకం నిర్వహణకు పైసా కూడా విదల్చకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.**


నీరు లేక వెలవెలబోతున్న డోన్ మండలం ఓబులాపురం నడిమికుంట


హంద్రీనీవా కాల్వ దగ్గర చెరువులకు నీటిని పంపింగ్ చేసే పథకం

కర్నూలు సిటీ: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పశ్చిమ ప్రాంతంలో కరువును తరిమేందుకు చర్యలు తీసుకుంది. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా కృష్ణా జలాలతో ఈ ప్రాంతంలోని 70 చెరువులను నింపేలా పనులు చేపట్టి చకచకా పూర్తి చేసింది. గతేడాది సెప్టెంబరు 19వ తేదీన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆ చెరువులను జాతికి అంకితం చేశారు. అయితే, మొన్నటి ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ఆ చెరువులకు నీరిచ్చే పథకం నిర్వహణకు నిధులు ఇవ్వలేదు. వర్షాకాలం ప్రారంభమై మూడునెలలైనా హంద్రీనీవా కాలువ నీటితో చెరువులు నింపలేని పరిస్థితి. పథకం నిర్వహణకు రూ.1.25 కోట్లు మంజూరు చేయాలని జల వనరుల శాఖ ఇంజినీర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసినా మార్పుల పేరుతో ఫైల్‌ను ఇప్పటి వరకు నాలుగైదు సార్లు వెనక్కి ముందుకు వెళుతుంది. కానీ నిధులు మాత్రం మంజూరు కావడం లేదు. దీంతో ప్రస్తుతం 70 చెరువులకు నీటి పంపింగ్‌కు అవకాశం ఉన్నా 22 చెరువులకు మాత్రమే అధికారులు పంపింగ్ మొదలు పెట్టారు. ఇంత వరకు ఒక్క చెరువులో కూడా 20 శాతం మేర నీరు చేరలేదు. స్థానికంగా ఈ పరిస్థితులు ఉంటే హంద్రీనీవా కాలువను పరిశీలించేందుకు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నేడు(ఆదివారం)జిల్లాకు రానున్నారు.

**ఈసారి సాగు, తాగునీటికి కష్టాలే!**

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద జిల్లాలో 80 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. వీటితో పాటు చెరువులకు కూడా నీరు ఇవ్వొచ్చని డీపీఆర్‌లోనే ఉంది. 2019కి ముందు అధికారంలో ఉన్న టీడీపీ ఎన్నికలకు ఆరు నెలల ముందు హడావుడిగా 68 చెరువులకు నీరు ఇచ్చేందుకని 224.31 కోట్లతో పరిపాలన అనుమతులు ఇచ్చింది. రూ 177.93 కోట్లకు 21 మే 2018న టెండర్ పిలిచి రూ 186.10 కోట్లకు కోయా సంస్థకు అగ్రిమెంట్ చేయించి పనులు మొదలు పెట్టించింది. అయితే, అప్పట్లో పైపు లైన్ పనులు 13 శాతం మాత్రమే చేశారు. 2019లో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం వచ్చాక భూసేకరణ, డిజైన్స్‌కి అనుమతులతో పాటు, ఫారెస్ట్ భూములకు స్టేజ్-1, స్టేజ్-2 అనుమతులు ఇప్పించింది. నాటి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన్న రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని 70 చెరువులకు నీరిచ్చేలా పనులు చేయించారు. దీంతో ఈ పథకం ద్వారా డోన్, పత్తికొండ, ఆలూరు, పాణ్యం నియోజకవర్గాల్లోని 57 గ్రామాలకు, 10,130 ఎకరాలకు తాగు, సాగు నీరు అందుతుంది. అయితే, ఈ ఏడాది భారీ వర్షాలు కురిసినా హంద్రీనీవా కాల్వ నుంచి చెరువులకు నీటిని అందించేందుకు నిర్వహణ నిధులు లేక అధికారులు పంపింగ్ ఆలస్యంగా మొదలుపెట్టారు. లేకపోతే ఈ సమయంలో 70 చెరువులు నీటితో కళకళలాడాలి. సర్కారు నిర్లక్ష్యంతో ఇప్పటికీ ఒక్క చెరువు కూడా నిండకపోవడంతో ఈఏడాది సాగు, తాగునీటికి అవస్థలు తప్పేలా లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీల లోగుట్టు

- ముందుగానే స్థానాలు నిర్ణయం
- ఇందుకు భారీగా డబ్బులు చేతులు మారిన వైనం
- నేడు తూతూమంత్రంగా బదిలీల కౌన్సెలింగ్

కర్నూలు(సెంట్రల్): రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలో బదిలీలు ప్రక్రియ గుట్టుగా సాగుతోంది. నిబంధనలు మేరకు రెండేళ్ల సర్వీసు పూర్తి అయిన వారిని కచ్చితంగా బదిలీ చేయాలి. అంతేకాక అభ్యర్థన బదిలీలకు స్థానం ఉండదు. ఈ క్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతోపాటు రెండు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, డీఐజీ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులను బదిలీ చేయాల్సి ఉంది. ఉద్యోగుల బదిలీల కోసం ఆదివారం కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. అయితే ప్రక్రియ నామమాత్రంగా ఉండబోతోందని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ముందుగా ఎవరికీ ఏ స్థానం కావాలో నిర్ణయించుకున్నారని, అందుకోసం భారీగా ముడుపులు సమర్పించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నంద్యాల, కర్నూలు, కల్లూరు ఆదోని, ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిచేసేందుకు వచ్చే సబ్‌రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్ల నుంచి పెద్ద ఎత్తున వసూళ్ల పర్వం కొనసాగినట్లు తెలుస్తోంది.

**నేడు జోన్-4 పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్**

జోన్-4 పరిధిలోని కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు సంబంధించిన సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లకు కర్నూలులోని డీఐజీ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఐజీ కల్యాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌కు 4 జిల్లాల డీఐజీలు, సబ్ రిజిస్ట్రార్లు హాజరుకావాలని ఆమె సూచించారు. అలాగే, మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆయా జిల్లాల రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్లు, ఇతర కింది స్థాయి సిబ్బందికి కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆమె వివరించారు.

## మద్యం తాగొద్దన్నందుకు..

- రైలు కింద పడి ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య

కర్నూలు: మద్యం తాగొద్దని కుటుంబ సభ్యులు మందలించినందుకు మనస్థాపంతో ఆరోరా నగర్‌లో నివాసముంటున్న కృష్ణకుమార్ (51) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణకుమార్, లక్ష్మీగంగా భవాని దంపతులకు ఇద్దరు కూతుర్లు సంతానం. ఈయన ఎలక్ట్రీషియన్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై కుటుంబ పోషణ పట్టించుకోకుండా తిరుగుతుండటంతో కుటుంబం గడవటమే కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో తరచూ భార్యాభర్తల మధ్య గొడవ జరిగేది. శుక్రవారం రాత్రి కూడా ఫుల్‌గా మద్యం సేవించి ఇంటికి చేరుకోవడంతో భార్యతో పాటు కుటుంబ సభ్యులు తీవ్రంగా మందలించారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. శనివారం ఉదయం గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో రైల్వే పట్టాలపై శవమై కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.


సినిమా టికెట్ల కౌంటర్ కాదు..

ఈ చిత్రంలో గుమిగూడిన జనాన్ని చూస్తే ఏ కొత్త సినిమా కౌంటర్ వద్ద ఉన్న హడావుడి కాదు. తమకు వచ్చిన వ్యాధిని తగ్గించుకునేందుకు ఆసుపత్రిలో డాక్టర్ వద్దకు రాగా, వారు ఎక్స్‌రే తీయించాలన్నారు. ఎక్స్‌రే తీయించాలంటే రూ.50 చొప్పున ఎన్ని ఎక్స్‌రేలు తీయించుకుంటే అంత సొమ్ము చెల్లించాలి. డాక్టర్ వద్ద నుంచి రేడియాలజి విభాగానికి వెళ్లి అక్కడ నెంబర్ వేయించుకుని, తిరిగి ఎక్స్‌రేకు డబ్బులు చెల్లించే కౌంటర్ వద్దకు వచ్చి డబ్బులు చెల్లించాలి. ఈ రెండు చోట్లా పెద్ద క్యూలు ఉండటంతో గంట సమయం దానికే సరిపోతోంది. శనివారం డబ్బు చెల్లించేందుకే గంటసేపు నిలబడాల్సి రావడంతో రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి వాటిలోనే నంబర్ కేటాయింపు, డబ్బు చెల్లింపు జరిగేలా ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)


నన్ను వదిలి నీవు పోలేవులే.. ఒకదానికి వెనుక మరొకటి


పువ్వులో పువ్వునై.. ప్రకృతికి అందాలను జోడిస్తూ

ఒళ్లంతా కన్నులై.. ప్రేమకు ప్రతిరూపాలై..

## ఒళ్లంతా కన్నులై.. ప్రకృతి 'కోక'లై!

"చెంగావి రంగు చీర కట్టుకున్న చిన్నది, అందమంతా చీరలోనే ఉన్నది.." ఈ పాట సినీ ప్రేమికులను ఉర్రూతలూగించింది. ఈ కోవలోనే ఒళ్లంతా రంగులు పులుముకొన్న సీతాకోకచిలుకలు ప్రకృతికే అందాలను అద్దుతున్నాయి. ప్రకృతి ప్రేమికుల మనసు దోస్తున్నాయి. వర్షాలు కురిసి, పచ్చదనం మెరిసిన వేళ.. చెంగు చెంగుమని గాలిలో రెక్కలు విప్పుకొని తిరిగే ఈ అందాల సీతాకోకలను అలా చూస్తూ ఉండిపోవాల్సిందే. పువ్వులు కనిపిస్తే చాలు.. అలా వాలిపోయి మకరందాన్ని జుర్రేస్తూ, ఒకదాని వెంట మరొకటి పోటీపడి తమ అందాలను ఆరబోస్తుంటే.. ఎగిరిపోతే ఎంత బాగుంటుందని పాడుకోవాల్సిందే. కర్నూలు నగర శివారులో శనివారం వాతావరణం చల్లబడిన వేళ కనిపించిన అందాలివీ. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

## రైలు కింద పడి వ్యక్తి బలవన్మరణం

కోవెలకుంట్ల: నంద్యాల- ఎర్రగుంట్ల రైల్వే మార్గంలో కోవెలకుంట్ల మండల సొదరదిన్నె గ్రామ శివారులో శనివారం రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నంద్యాల రైల్వే ఎస్ఐ జలీల్ తెలిపిన సమాచారం మేరకు.. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండలం మోరగుడి గ్రామానికి చెందిన దండె పక్కీరప్పకు సూర్యనారాయణ(45), దాసు సంతానం. పెద్ద కుమారుడైన దాసును భార్య వదిలేయడంతో 30 సంవత్సరాల క్రితం కోవెలకుంట్లకు వచ్చి మరో వితంతు మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఆ మహిళ వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృత్యువాత పడింది. ఈ విషయాన్ని జీర్ణించుకోలేక దాసు మూడు రోజుల క్రితం మృతి చెందాడు. సోదరుడు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న సూర్యనారాయణ రెండు రోజుల క్రితం కోవెలకుంట్లకు వచ్చాడు. శనివారం ఉదయం సొదరదిన్నె సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్


దొంగను చూపిస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

కోవెలకుంట్ల: కిరాణా దుకాణాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగను కోవెలకుంట్ల పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ మల్లికార్జున రెడ్డి అందించిన సమాచారం మేరకు..తమిళనాడు రాష్ట్రానికి చెందిన శివకుమార్ అనే యువకుడు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో కిరాణా షాపుల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ నెల 18వ తేదీన కోవెలకుంట్ల పట్టణంలోని ఇండోర్‌స్టేడియం ఎదురుగా ఉన్న జనరల్ స్టోర్ షట్టర్ తాళం బ్రేక్ చేసి రూ. 35 వేలు నగదు ఎత్తుకెళ్లాడు. మెయిన్‌రోడ్‌లో అమర్చిన సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా పోలీసులు దొంగను గుర్తించారు. పట్టణ శివారులోని ముదిగేడు రహదారిలో రైల్వే బ్రిడ్జి వద్ద అదుపులోకి తీసుకున్నారు. జనరల్ స్టోర్‌లో చోరీకి పాల్పడినట్లు విచారణలో ఒప్పుకున్నాడు. కాగా శివకుమార్‌పై తమిళనాడు రాష్ట్రంలోని అనేక పోలీస్‌స్టేషన్లలో దొంగతనం కేసులున్నాయి. చిత్తూరు జిల్లా రేణిగుంట పోలీసు స్టేషన్ కూడా ఇటీవల ఇతనిపై చోరీ కేసు నమోదైంది. ఎట్టకేలకు అంతరాష్ట్ర దొంగను కోవెలకుంట్ల పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.